క్లుప్తంగా

అనంతపద్మనాభస్వామి శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సూరారం గ్రామంలో వెలసిన అనంతపద్మనాభస్వామి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. హోలీ పౌర్ణమి సందర్భంగా సోమవారం రాత్రి వైభంగా శోభయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో ముందుకుసాగగా, అధిక సంఖ్యలో భక్తులు కీర్తనలు ఆలపించారు.

ఉత్సాహంగా సంగమేశ్వరుని జాతర



బండ్ల ఊరేగింపులో భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొట్టాలలో సోమవారం సంగమేశ్వరస్వామి జాతర ఘనంగా జరిగింది. ఉత్సవాలలో భాగంగా పురోహితుడు తమ్మలి శ్రీహరి స్వామికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. గ్రామస్తులు మొక్కులు తీర్చుకున్నారు. కొట్టాల, లింగంపల్లి, వెల్మకన్న గ్రామాలకు చెందిన భక్తులు బండ్లు, ట్రాక్టర్లు ఊరేగించారు. బీజేపీ జిల్లా నాయకుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయ భూమి ఆక్రమించలేదు



ఇంటి నిర్మాణం వద్ద మాధవి కుటుంబసభ్యులు

వెల్దుర్తి(తూప్రాన్): గడి మైసమ్మ ఆలయ భూమి తాము ఆక్రమించినట్లు గ్రామానికి చెందిన కొందరు ప్రచారం చేయడం అవాస్తవమని మండలంలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన కొడె మాధవి కుటుంబ సభ్యులు వాపోయారు. గ్రామానికి చెందిన ప్రతాప్‌రెడ్డి వద్ద కొనుగోలు చేసిన భూమిలో పంచాయతీ నుంచి అనుమతులు తీసుకొని ఇల్లు నిర్మించుకుంటుంటే గ్రామానికి చెందిన కొందరు తాము ఆలయ భూమిని కబ్జాచేసినట్లు ఆరోపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ప్రజావాణిలో ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తిచేశారు.

నేడు ఆంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

కౌడిపల్లి(నర్సాపూర్): స్థానిక శివ పంచాయతన నవగ్రహ దేవత సమేత ఆంజనేయస్వామి ఆలయం, పోచమ్మదేవి ఆలయం, రేణుక ఎల్లమ్మదేవి ఆలయం ప్రథమ వార్షికోత్స పూజలు 26న నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. పురోహితుడు రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, సుజాత దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేయనున్నట్లు చెప్పారు.

రైతులను మోసం చేసిన ఎంపీ అభ్యర్థి

సోషల్‌మీడియా కన్వీనర్

చేగుంట(తూప్రాన్): మల్లన్న సాగర్ బాధిత రైతులకు అన్యాయం చేసిన వ్యక్తి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా పోటీలో నిలబడుతున్నారని నియోజకవర్గ సోషల్‌మీడియా కన్వీనర్ ఆంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వెంకట్‌రామ్‌రెడ్డి కలెక్టర్‌గా ఉన్న సమయంలో కమీషన్లు ఇచ్చిన రైతులకే పరిహారం ఇప్పించారని ఆరోపించారు. మల్లన్న సాగర్ బాధిత రైతులను మోసం చేసిన ఆయనకు సిద్దిపేట ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

కళాకారుడికి పొట్టి శ్రీరాములు పురస్కారం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ గ్రామానికి చెందిన కళాకారుడు కొంకల ఎల్లయ్యకు పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పురస్కారం లభించింది. వివిధ రంగాలలో విశేష కృషి చేసిన వారికి ఏటా ప్రతిభా పురస్కారాలతో సత్కరిస్తోంది. ఈ సారి కళాకారుడు కొంకల ఎల్లయ్య పురస్కారానికి ఎంపికయ్యాడు. ఈనెల 28వ తేదీన హైదరాబాద్‌లోని యూనివర్సిటీలో పురస్కారంతో పాటు రూ.20,116 నగదు బహుమతి అందజేయనున్నట్లు ఎల్లయ్య తెలిపారు. ఆయనను కవులు, కళాకారులు అభినందించారు.

హోలీ వర్ణాల కేళి



మెదక్: పీఆర్టీయూ సభ్యుల సంబరాలు



పాపన్నపేట(మెదక్): హోలీ ఆడుతున్న గ్రామస్తులు

జిల్లావ్యాప్తంగా హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. సోమవారం చిన్న, పెద్దా తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. కొందరు తమ స్నేహితులు, బంధువులతో నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి ఒక్కరి జీవితం రంగులమయం కావాలని ఆకాంక్షించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాదులోని ఆమె నివాసం వద్ద ఉత్సాహంగా హోలీ వేడుకలు జరుపుకున్నారు. మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ తన మిత్రులు, ఆయా పార్టీల నాయకులు, వ్యాపారులతో కలిసి రంగులు చల్లి నృత్యంచేస్తూ ఆనందంగా గడిపారు. తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలో చైర్‌పర్సన్ జ్యోతి పట్టణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. యువత, మహిళలతో సంబరాలు చేసుకున్నారు.



నర్సాపూర్‌లో నృత్యం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్



టేక్మాల్‌లో చిన్నారులు..



రేగోడ్‌లో..



కొల్చారంలో పిల్లల కోలాహలం..



కౌడిపల్లి(నర్సాపూర్): హోలీ సంబరాలలో మహిళలు



పెద్దశంకరంపేటలో కోలాటం..



చేగుంట(తూప్రాన్): చేగుంటలో..



తూప్రాన్: ఇస్లాంపూర్‌లో యువకులు..



చిలప్‌చెడ్(నర్సాపూర్): చండూర్‌లో..



మనోహరాబాద్(తూప్రాన్): కాళ్లకల్‌లో..



మెదక్ పట్టణంలో..



హవేళిఘణాపూర్(మెదక్): రంగులు అద్దుకుంటున్న విద్యార్థినులు

ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలి

మెదక్ డీఎస్పీ రాజేశ్

పెద్దశంకరంపేట(మెదక్): ప్రతీ వాహనాన్ని తప్పనిసరిగా తనిఖీ చేయాలని మెదక్ డీఎస్పీ రాజేశ్ ఆదేశించారు. సోమవారం పెద్దశంకరంపేట మండలం కోళాపల్లి పాత టోల్‌ప్లాజా 161వ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు వాహనాలను స్వయంగా తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజలు రూ.50 వేల కంటే ఎక్కువగా నగదు తీసుకెళ్లొద్దని, అత్యవసరమైతే సరైన పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. డ్రైవర్లు నిబంధనలను తప్పకుండా పాటించాలని పిలుపునిచ్చారు. వాహనాల తనిఖీలపై ఎస్‌ఐ శంకర్‌కు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సునీత, సిబ్బంది తదితరులున్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ రాజేశ్

క్రీడలతోనే శారీరక, మానసిక దృఢత్వం



నగదు బహుమతి అందజేస్తున్న పరశురామ్‌రెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): క్రీడలు ఆడడంతోనే శారీరక, మానసిక దృఢత్వం లభిస్తుందని మాజీ సర్పంచ్ పరశురామ్‌రెడ్డి అన్నారు. సోమవారం చిలప్‌చెడ్ మండలం అజ్జమర్రి గ్రామ యువకులకు ఆయన తన నానమ్మ పట్లోళ్ల సత్తమ్మ జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నీ నిర్వహించారు. గెలిచిన జట్టుకు రూ.3వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు మొబైల్ ఫోన్‌లతోనే ఎక్కువ కాలం గడుతుపుతున్నారని, క్రీడలకు అధిక ప్రాముఖ్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్లయ్య, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకే ఫిషరీష్ ఫెడరేషన్ చైర్మన్ పదవి



హుస్నాబాద్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర ఫిషరీష్ ఫెడరేషన్ చైర్మన్ పదివి ముదిరాజ్‌లకే ఇవ్వాలని హుస్నాబాద్ మండల ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు పొన్నబోయిన శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం మీర్జాపూర్ ముదిరాజ్ సంఘం సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో మత్స్యకార సొసైటీల్లో ముదిరాజ్‌లకు ఎక్కువ సభ్యత్వాలు ఉన్నాయని, అలాంటి ముదిరాజ్ సామాజిక వర్గానికి కాకుండా గంగపుత్రులకు ఎట్లా ఇస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ముదిరాజ్‌లకే ఇవ్వాలన్నారు. గ్రామాల్లో చేపల వ్యాపారం కోసం చేసుకునేందుకు మత్స్యకారులకు వాహనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. సబ్సిడీపై ద్విచక్ర, త్రీ వీలర్స్, గూడ్స్ వాహనాలను అందించాలన్నారు.

బండికే గిరిజనుల మద్దతు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలంలోని గిరిజనుల మద్దతు ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కే ఉంటుందని బీజేపీ మండల గిరిజన మోర్చా అధ్యక్షుడు లావుడ్య రాజన్‌నాయక్ అన్నారు. సోమవారం భల్లునాయక్ తండా గిరిజనులతో మాట్లాడి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీకి మద్దతుగా నిలవాలని, మళ్లీ మోదీని ఎన్నుకోవాలన్నారు. గిరిజనుల సమస్య పరిష్కారం కోసం మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు బండి సంజయ్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

మహిళ అదృశ్యం



ప్రమీల(ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): మహిళ అదృశ్యమైన ఘటన మండల పరిధి నవాబుపేట గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సింగిరెడ్డి ప్రమీల ఒంటరిగా నివసిస్తోంది. ఆమె కొడుకు శ్రీధర్‌రెడ్డి మేడ్చల్‌లో ఉద్యోగం చేసుకుంటూ వారానికి ఒకసారి తల్లిని చూడడానికి వస్తుంటాడు. ఈ నెల 17న శ్రీధర్‌రెడ్డి గ్రామానికి రాగా తల్లి కనిపించలేదు. దీంతో ఆయన బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు, సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇళ్లలోకి చొరబడేందుకు యత్నించిన వ్యక్తి

పోలీసులకు అప్పగించిన స్థానికులు

నర్సాపూర్ రూరల్: గుర్తుతెలియని వ్యక్తిని స్థానికులు పోలీసులకు అప్పగించారు. ఓ వ్యక్తి సోమవారం మధ్యాహ్నం 13, 14వ వార్డుల్లోని పలు ఇళ్లలోకి చొరబడేందుకు ప్రయత్నించగా స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ విషయమై నర్సాపూర్ ఎస్‌ఐ పుష్పరాజును వివరణ కోరగా ఆ వ్యక్తికి మతిస్థిమితం లేదని చెప్పారు.

ముమ్మరంగా పొద్దు తిరుగుడు కొనుగోలు



తొగుట వ్యవసాయ మార్కెట్ యార్డులో పొద్దుతిరుగుడు గింజల బస్తాలు

తొగుట(దుబ్బాక): తొగుట వ్యవసాయ మార్కెట్‌లో పొద్దు తిరుగుడు గింజల కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. పీఏసీఎస్ ద్వారా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. మార్కెట్‌లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సొసైటీ చర్యలు తీసుకుంది. అధికారులు గోనె సంచులు, రవాణాకు లారీలను అందుబాటులో ఉంచారు. కొనుగోలు చేసిన గింజలను వెంటనే గోదాములకు తరలిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తొగుటలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో రైతులకు సౌకర్యంగా ఉంది. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 6,760 చెల్లిస్తోంది. గతంలో దళారులకు విక్రయించేవారు. లేదంటే సిద్దిపేటకు తరలించి మిల్లర్లకు విక్రయించేవారు. సరైన ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పుడు మద్దతు ధరతో లాభం, రవాణా ఖర్చులు మిగులుతున్నాయి. యాసంగిలో ఆరుతడి పంటలైన పొద్దు తిరుగుడు, మొక్కజొన్న సాగుచేయాలని ప్రభుత్వం రైతులకు సూచిస్తోంది. ఈ ఏడాది మండలంలో సమారు 600 ఎకరాల్లో పొద్దుతిరుగుడు పంట సాగుచేశారు. కొనుగోలు కేంద్రం ద్వారా 222 మంది రైతుల నుంచి 2,764.50 క్వింటాళ్ల గింజలు కొనుగోలు చేశారు. మండల రైతులతో పాటు రాయపోల్, మిరుదొడ్డి, దౌల్తాబాద్, కొండపాక మండలాల రైతులు కొనుగోలు కేంద్రంలో విక్రయిస్తున్నారు. స్థానికంగా ఏర్పాటు చేయడంతో రానున్నరోజుల్లో పొద్దుతిరుగుడు సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

నూతన నియామకం

దుబ్బాకటౌన్: జాతీయ మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర పోలిట్ బ్యూరో చైర్మన్‌గా ర్యాకం శ్రీరాములు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్, రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. శ్రీరాములు మాట్లాడుతూ తనపై నమ్మకంతో చైర్మన్‌గా నియమించినందుకు సంతోషంగా ఉందన్నారు. జాతీయ, రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేశ్ సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కల్యాణం

కొల్చారం(నర్సాపూర్): మండల పరిధిలోని పైతర గ్రామంలో భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించారు. సోమవారం ఎదురుకోలు కార్యక్రమంతో కల్యాణ తంతు ప్రారంభించారు. ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా వేసిన మంటపంలో రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం మొక్కులను చెల్లించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించి, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మంగళవారం తెల్లవారుజామున స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఘనంగా ఊరేగించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



పూజలు నిర్వహిస్తున్న మాధవానంద స్వామి